WWW.EPAPER.MAHADAILY.COM

మహా పత్రిక

ఖమ్మం


భద్రాద్రి కొత్తగూడెం

10-1-2025



## తుమ్మల చెరువుకు పర్యాటక సొబగులు

మణుగూరు, మహా: పినపాక నియోజకవర్గం లోని అశ్వాపురం తుమ్మల చెరువులో గురువారం స్థానిక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు హాజరై బోటింగ్‌ను ప్రారంభించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ తుమ్మల చెరువు అనేది సుమారు 1500 ఎకరాల విస్తీర్ణం కలిగి కాకతీయుల కాలంలో నిర్మించబడినదని తెలిపారు.



02



## ఏసీబీకి చిక్కిన ముస్లిం మైనార్టీ గురుకుల ప్రిన్సిపాల్

### రూ 2 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడిన ప్రిన్సిపల్, అటెండర్

ఇల్లందు, మహా: ముస్లిం మైనారిటీ గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ గా పనిచేస్తున్న డాక్టర్ భీమనపల్లి కృష్ణ తో పాటు అటెండర్ రామకృష్ణలు రూ 2 వేలు లంచం తీసుకుంటూ గురువారం ఏసీబీకి పట్టుబడ్డారు.

02



## 75 లక్షల నిధులతో అభివృద్ధి పనులకు శ్రీకారం

- డిగ్రీ కళాశాలలో ఆర్వో ప్లాంట్ ప్రారంభించిన ఎమ్మెల్యే పాయం
- సింగరేణి సౌజన్యంతో మరింత అభివృద్ధికి కృషి

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సింగరేణి సిఎస్ఆర్ నిధులతో నిర్వహించిన పలు అభివృద్ధి పనులను స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ప్రారంభించారు. సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ సౌజన్యంతో మణుగూరు మండలంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు.

మణుగూరు, మహా

02



# అలల ఊయలపై సీతారాములు..

## అపురూపం రాములోరి జలవిహారం

- సీతారాముల జలవిహారం ముగ్ధ మనోహరం...! వేద ఘోష పరిమళాలు...!
- మిరిమిట్లు గొలిపే బాణసంచా వెలుగు జిలుగులు...!
- అశేష భక్తజన సందోహం...!
- జగదభి రామ జానకి రామా అంటూ భక్తుల జయ జయ ద్వానాలు...!
- శ్రీరామచంద్రుడు సీతా లక్ష్మణ సమేతంగా గావించిన తెప్పోత్సవం
- ఆబాల గోపాలాన్ని మైమరిపించింది...!
- దక్షిణ అయోధ్య భద్రాచలం మురిసి మెరిసింది...!

భద్రాచలం, మహా

భద్రాచలం మహా పుణ్యక్షేత్రం. పుణ్య తీర్థం కూడా. ముక్కోటి వేడుక తరతరాలుగా సాంప్రదాయ బద్ధంగా ఇక్కడ వైభవంగా జరుపుతారు. ఈ ఏడాది శ్రీ వైకుంఠ ఏకాదశి అధ్యయన మహోత్సవాల్లో భాగంగా గురువారం సాయంకాల సంధ్యా సమయాన భద్రాచల పవిత్ర పావన గౌతమి నదీ తీరంలో శ్రీ సీతారామచంద్ర స్వామి వారి జలవిహారం వేడుక కనుల పండువుగా, కమనీయంగా, రమనీయంగా నిర్వహించారు. దక్షిణ అయోధ్యగా భాసిల్లుతున్న భద్రాచల రామాలయంలో తొలుత వేద పండితులు ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## ఏసీబీకి చిక్కిన ముస్లిం మైనార్టీ గురుకుల ప్రిన్సిపాల్



**ఇల్లందు, మహా:** ముస్లిం మైనారిటీ గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ గా పనిచేస్తున్న డాక్టర్ భీమనపల్లి కృష్ణ తో పాటు అటెండర్ రామకృష్ణలు రూ 2 వేలు లంచం తీసుకుంటూ గురువారం ఏసీబీకి పట్టుబడ్డారు. ఇదే పాఠశాలలో కాంట్రాక్ట్ పద్ధతిలో ఉపాధ్యాయురాలు విధులు నిర్వహిస్తున్నారు. గడిచిన ఆరు నెలల్లో సంబంధించిన వేతన చెల్లింపు విషయంలో బిల్లులు పంపించేందుకు ప్రిన్సిపల్ రూ. 20 వేలు డిమాండ్ చేయగా తన వద్ద అంత లేవంటూ రూ 2 వేలు ఇస్తాను అంటూ చెప్పి తమకు సమాచారం ఇచ్చిందని ఏసీబీ డీఎస్పీ వై రమేష్ తెలిపారు. బాధితురాలు ఫిర్యాదు మేరకు గురువారం ఉదయం దాడులు నిర్వహించి పట్టుకున్నట్లు తెలిపారు. అయితే ప్రిన్సిపల్ నేరుగా ఈ నగదు తీసుకోకుండా అటెండర్ రామకృష్ణ కు ఇప్పించి ఆయన ద్వారా ఈ మొత్తాన్ని తీసుకున్నట్లు తెలిపారు.

## సిపిఐ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలి



**మణుగూరు, మహా:** భారత కమ్యూనిస్టు పార్టీ బలోపేతానికి గ్రామస్థాయి నుంచి ప్రతి కార్యకర్త కృషి చేయాలని, సిపిఐ ఈ ప్రాంత అభివృద్ధిలో కీలకపాత్ర పోషించిందని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి అయోధ్య అన్నారు. గురువారం సిపిఐ కార్యాలయంలో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పార్టీ ఆవిర్భవించి వంద సంవత్సరాలు అయిన సందర్భంగా పార్టీ పేద ప్రజల పక్షపాతి అని, కార్మిక, కర్షక, అనగారిన వర్గాల కోసం నిరంతరం పాటుపడే పార్టీ కమ్యూనిస్టు పార్టీ అని అన్నారు. అధికారం ఉన్నా లేకున్నా పేద ప్రజల పోరాడాలని అన్నారు. సిపిఐ శత జయంతి ఉత్సవాలు దేశ వ్యాప్తంగా జరపడం మామూలు విషయం కాదని, అధికారం లేకుంటే కనుమరుగైపోతున్న అనేక పార్టీలు నేడు మనం కళ్ళకు కట్టినట్లు చూస్తున్నామని అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పినపాక నియోజకవర్గ కార్యదర్శి సరెడ్డి పుల్లారెడ్డి, మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి మున్న లక్ష్మీకుమారి, పట్టణ కార్యదర్శి దుగ్యాల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## మల్లేశ్వరస్వామి ఆలయంలో హుండీ చోరీ

**అశ్వారావుపేట, జనవరి 9, మహా:** అశ్వారావుపేట మండలం మామిళ్ళవారి గూడెంలో ఉన్న శ్రీశ్రీశ్రీ మల్లేశ్వరస్వామి ఆలయంలో బుధవారం అర్ధరాత్రి హుండీ చోరీ జరిగింది. గుర్తు తెలియని దుండగులు ఆలయ గేటు తాళాలు పగలగొట్టి లోపలికి చొరబడి, హుండీని ఎత్తుకెళ్లారు. గురువారం ఉదయం పూజా కార్యక్రమాలకు వచ్చిన ఆలయ పండితులు ఈ విషయం గుర్తించి ఆలయ కమిటీ సభ్యులకు సమాచారం అందించారు. వెంటనే వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఆలయాన్ని సందర్శించి చోరీ తీరును పరిశీలించి, దుండగుల ఆచూకీ కోసం విచారణ చేపట్టారు.

## బాల వైజ్ఞానిక ప్రదర్శనలో మణుగూరు టిఎల్ఏ నమూనా ఎంపిక

**మణుగూరు, మహా:** రాష్ట్ర స్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శన గురువారం మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్ల లో నిర్వహించారు. ఈ ప్రదర్శనలో మణుగూరు జెడ్పి కో ఎడ్యుకేషన్ పాఠశాలకు చెందిన బయో సైన్స్ ఉపాధ్యాయుడు పరమయ్య ప్రదర్శించిన నమూనా సౌత్ ఇండియాకు ఎంపికైంది. ఈ మేరకు గురువారం ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి, జిల్లా కలెక్టర్ విజయేందర్ బోయిల చేతుల మీదుగా జ్ఞాపికను గురువారం అందుకున్నారు. ఈ ప్రదరనకు 33 జిల్లాల నుండి 48 నమూనాలు ప్రదర్శించగా, పరమయ్య తయారు చేసిన టిఎల్ఎం నమూనా తృతీయ స్థానంలో నిలిచి పాండిచ్చేరిలో జరిగే సౌత్ ఇండియా ప్రదర్శనకు ఎంపికైంది. సౌత్ ఇండియాకు ఎంపికైన టీఎల్ఎం నమూనాను తయారు చేసిన ఉపాధ్యాయుడు పరమయ్యను జిల్లా సైన ర్స్ అధికారి చలపతిరావు, కో ఆర్డినేటర్ సంపత్, మణుగూరు ఎంఈఓ స్వర్ణజ్యోతి, జెడ్పి కో ఎడ్యుకేషన్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నాగశ్రీ, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.



# రమణీయం సీతారాముల జలవిహారం

**భద్రాచలం జనవరి 9 (మహా):** భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి వారి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ముక్కోటి ఏకాదశి అధ్యయనోత్సవాల్లో భాగంగా గురువారం నిర్వహించిన తెప్పోత్సవం నేత్రపర్వంగా సాగింది. వైకుంఠ ఏకాదశి ఉత్సవాలలో భాగంగా ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆరాధన, ఏకాంత తిరుమంజనం, నివేదన అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. సాయంత్రం నాలుగు గంటలకు స్వామి వారు హంసవాహనంపైవిహరించేందుకు ఆలయం నుంచి గోదావరి తీరానికి బయలు దేరారు. అర్చకుల వేదమంత్రోచ్ఛరణలు, మేళతాళాలు, భక్తుల రామనామ స్మరణలతో శ్రీసీతారామచంద్రస్వామివారిని ప్రత్యేక పల్లకిలో ఊరేగింపుగా గోదావరి నదీ తీరానికి తీసుకొచ్చారు. ప్రత్యేకంగా తయారు చేసిన హంసవాహనంపై స్వామి వారిని ఉంచి వేదపండితులు, అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆరు గంటల నుంచి గంటపాటు గోదావరిలో స్వామి వారికి తెప్పోత్సవం నిర్వహించారు. బాణసంచా వెలుగులతో శోభాయమానంగా సాగిన ఈ ఉత్సవాన్ని భక్తులు కనులారా వీక్షించి పరవశించిపోయారు.



## 75 లక్షల సిఎస్ఆర్ నిధులతో అభివృద్ధి పనులకు శ్రీకారం

**మణుగూరు, మహా:** ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సింగరేణి సిఎస్ఆర్ నిధులతో నిర్వహించిన పలు అభివృద్ధి పనులను స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ప్రారంభించారు. సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ సౌజన్యంతో మణుగూరు మండలంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. 2024–25 సిఎస్ఆర్ నిధుల ద్వారా అభివృద్ధి పనులకు ఆయన శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం మాట్లాడుతూ 10 లక్షల అంచనా తో త్రాగునీటి ఆర్వో ప్లాంట్ నిర్మాణం, 35 లక్షలు ఖర్చుతో స్టాఫ్ రూమ్ నిర్మాణం, 25 లక్షలు మేజర్ రిపేర్ పనులను చేయడం జరుగుతుందన్నారు. సింగరేణి సౌజన్యంతో విద్యారంగం, ఇతర మౌలిక సదుపాయాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని, ఈ అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు, విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జీడిసి మణుగూరు భద్రయ్య, ఏజిఎం వెంకటేశ్వర్లు, సింగరేణి డీజిఎం రమేష్, ఐటీడీఏ డీఈ మధుకర్, ఏఈ ప్రసాద్, ప్రిన్సిపల్ సత్య ప్రకాష్, జిఎంపిటి ప్రిన్సిపాల్ శాంతి సుధా, మణుగూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పీర్నాకి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## తుమ్మల చెరువుకు పర్యాటక సొబగులు



**మణుగూరు, మహా:** పినపాక నియోజకవర్గం లోని అశ్వాపురం తుమ్మల చెరువులో గురువారం స్థానిక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు హాజరై బోటింగ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుమ్మల చెరువు అనేది సుమారు 1500 ఎకరాల విస్తీర్ణం కలిగి కాకతీయుల కాలంలో నిర్మించబడినదని తెలిపారు. ఈ చెరువు వల్ల కొన్ని వేల ఎకరాల పంట పొలాలకు సాగునీరు అందుతుందని, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడం ఎంతో అభినందనీయమని పేర్కొన్నారు. ఈ పర్యాటక కేంద్రం అభివృద్ధికి జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ప్రత్యేక చొరవ చూపి ప్రభుత్వ నిధుల రూపంలో 10 లక్షల రూపాయల మంజూరు చేయించినందుకు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. డ్వాక్రా మహిళ సంఘాలకు ఈ కేంద్రం నిర్వహణ బాధ్యత అప్పగించడం ద్వారా వారు మరింత అభివృద్ధి సాధించాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సూచించారు. పినపాక నియోజకవర్గం పారిశ్రామికంగా అభివృద్ధి చెందిందని, ఐటీసీ, సింగరేణి, బారాజల కర్మాగారం, బీటీపీఎస్ వంటి ప్రముఖ పరిశ్రమలు ఈ ప్రాంత ప్రజలకు ఉపాధి కల్పిస్తున్నాయని అన్నారు. ఈ పర్యాటక కేంద్రం సెలవు దినాలు, పండుగ వేళల్లో ప్రజలు తమ కుటుంబ సభ్యులతో కలిసి సందర్శించి సేద తీర్చుకోవడానికి ఉత్తమమైన కేంద్రంగా అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు, అశ్వాపురం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఓరుగంటి బిక్షమయ్య, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు మరియు తదితరులు హాజరయ్యారు.

మహా పత్రిక
ANN తెలుగు

## మెడికల్ మాఫియాను అరికట్టాలని డిమాండ్



**ఖమ్మం సిటి, జనవరి 09, మహా:** మెడికల్ మాఫియా నియంత్రణకు కఠిన చర్యలు చేపట్టాలని, నిబంధనలకు విరుద్ధంగా పనిచేస్తున్న మెడికల్ షాపులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ, గురువారం డ్రగ్ అధికారికి ప్రగతిశీల యువజన సంఘం, ప్రగతిశీల మహిళా సంఘాల ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ హాస్పిటల్లో మెరుగైన వైద్యం అందకపోవడంతో పేదలు, మధ్యతరగతి ప్రజలు ప్రైవేట్ ఆసుపత్రుల వైపు వెళ్తున్నారు. అధిక ఫీజులు వసూలు చేస్తూ కార్పొరేట్ ఆసుపత్రులు ప్రజలను దోచుకుంటున్నాయని పివైఎల్ జిల్లా కార్యదర్శి ఎన్వి రాకేష్ ఆరోపించారు. మెడికల్ షాపులు బిల్లులు ఇవ్వకుండా అధిక ధరలకు మందులు విక్రయించడం వల్ల పేదలు మరింత ఆర్థికంగా నష్టపోతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ శిరోమణి, ఆవుల మంగతాయి, టీ ఝాన్సీ, రవీందర్ పాల్గొన్నారు.

## నేడు మెగా ముగ్గుల పోటీలు

**పాలేరు, జనవరి 9,మహా:** సంక్రాంతి పండుగ సందర్భంగా రాష్ట్ర రెవెన్యూ గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశాల మేరకు పాలేరు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో శుక్రవారం సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నట్లు ఖమ్మం క్యాంప్ కార్యాలయ ఇంచార్జ్ తుంబురు దయాకర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా నాలుగు మండలాల్లో ముగ్గుల పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కూసుమంచి మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల ఆవరణంలో మెగా ముగ్గుల పోటీలను నిర్వహిస్తున్నామని తెలిపారు. సుమారు 500 మంది మహిళలతో ముగ్గుల పోటీలను నిర్వహిస్తున్నామని, నియోజకవర్గ వ్యాప్తంగా 2వేల మంది మహిళలతో ముగ్గుల పోటీలను నిర్వహిస్తున్నామని తెలిపారు. కూసుమంచి మండల కేంద్రంలో జరిగే సంక్రాంతి సంబరాలు, ముగ్గుల పోటీలకు రాష్ట్ర రెవెన్యూ గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి దంపతులు హాజరవుతున్నట్లు క్యాంప్ కార్యాలయ ఇంచార్జ్ దయాకర్ రెడ్డి తెలిపారు.

## టిక్కెట్ లేకుండా గేమ్ చేంజర్ సినిమాకు రావద్దు

**ఖమ్మం క్రైమ్, జనవరి 9 , మహా:** 'గేమ్ ఛేంజర్' సినిమా రేపు (జనవరి 10) రిలీజ్‌కు అవుతున్న నేపథ్యంలో ఉదయం 4 గంటలకు సినిమా ఎక్స్ట్రా షో సంబంధించిన ఆన్‌లైన్ టిక్కెట్లు లేకుండా సినిమా థియేటర్ల పరిసరాలలోకి ఎవరు కూడా రావద్దని ఖమ్మం టౌన్ ఏసీపీ రమణమూర్తి తెలిపారు. ఇటీవల హైదరాబాదు థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనను దృష్టిలో పెట్టుకొని ముందస్తు చర్యలలో భాగంగా టిక్కెట్లు లేని వారిని దియేటర్ల పరిసరాలకు అనుమతించడం లేదని, అదేవిధంగా దియేటర్ల వద్ద బాణసంచా కాల్చడం నిషేధమని తెలిపారు. శాంతియువ వాతావరణానికి ప్రజలు/సీని అభిమానులు పోలీసులకు సహకరించాలని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని అన్నారు.

## ఘనంగా కందాళ పుట్టినరోజు వేడుకలు



**పాలేరు, జనవరి 9,మహా:** ఖమ్మం జిల్లా, కూసుమంచి మండల కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి జన్మదినం సందర్భంగా కూసుమంచి మండల పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా వేడుక నిర్వహించారు. మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్లో ఏర్పాటు చేసిన కేక్ ను బీఆర్ఎస్ పార్టీ నాయకులు కట్ చేయడం జరిగింది. ఈసందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు వేముల వీరయ్య మాట్లాడుతూ ప్రజల కోసం నిరంతరం ఆలోచించే పేద ప్రజల, బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి పుట్టిన రోజు వేడుకలను నియోజకవర్గ వ్యాప్తంగా ఘనంగా జరుపుకున్నామని తెలిపారు. ఆయన ఎమ్మెల్యేగా ఉన్నంతకాలం పాలేరు నియోజకవర్గం గురించి, ప్రజల గురించి ఆలోచించే వారిని, వేలాది మందికి న్యాయం చేసిన నాయకుడు కందాళ ఉపేందర్ రెడ్డి అని కొనియాడారు. ఆయన మంచితనంతో నేటికి ప్రజల గుండెల్లో నిలిచిపోయారని అన్నారు. ఈ కార్యక్రమంలో కూసుమంచి బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్ష కార్యదర్శులు ఆధ్వర్యంలో మాజీ ప్రజా ప్రతినిధులు, మాజీ సర్పంచులు మాజీ జడ్పీటీసీలు , స్థానిక నాయకులు పాల్గొన్నారు

# ప్రతి పనికి వారే... పట్టించుకునే వారేరి




## అర్ధ ఆకలితో పంచాయతీ కార్మికులు

- చాలీచాలని వేతనాలతో భారమైన కుటుంబ పోషణ
- పాలుపోని స్థితిలో గ్రామ మల్టీపర్పస్ కార్మికులు
- ప్రభుత్వాలు మారిన బ్రతుకులు మారలే
- చాలీచాలని జీతాలు ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితి
- పండుగ పూట పస్తులుంటున్నమంటూ ఆవేదన



**బోనకల్,జనవరి 09,మహా:** గ్రామాల పరిపాలనలో ఎంతో కీలకమైన పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు ఉదయం నుండి సాయంత్రం వరకు గ్రామాలలోని ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిస్తూ ఉంటారు. కానీ నేడు కార్మికుల కుటుంబాలు అర్ధ ఆకలితో అలమటిస్తున్నమని వారు వాపోతున్నారు,ప్రభుత్వాలు మారుతున్నాయి, పాలకులూ మారిన, వీరి జీవితాలు మాత్రం మారడం లేదు, ప్రభుత్వ పెద్దలు అధికారులు,ప్రజాప్రతినిధులు గ్రామ కార్మికులను పట్టించుకున్న దాఖలాలు లేవు.నెల నెల వేతనాలు రాక అప్పులు చేసి జీవనం కొనసాగిస్తున్నామని తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు,పంచాయతీ కార్మికులు చాలీచాలని జీతాలతో కాలం వెల్లదీస్తున్నారు. నెలకు 9500 రూపాయల జీతమైనా అందేది మాత్రం అంతంత మాత్రమే అయినా ఏళ్లుగా పంచాయతీల్లో పనిచేస్తున్న వారికి ఉద్యోగ భద్రత లేదని కొత్త ప్రభుత్వమైనా తమను ఆదుకోవాలని పంచాయతీ కార్మికులు,కారోబార్లు, కోరుతున్నారు. కారోబార్లను సహాయ పంచాయతీ కార్యదర్శులుగా పదోన్నతి కల్పిస్తామన్న హామీ కూడా ఇంతవరకు నెరవేరలేదు.మండల పరిధిలోని 22 గ్రామ పంచాయితీల్లో సుమారు 90 మంది గ్రామపంచాయతీ కార్మికులుగా,పంపు పరేటర్లుగా,ఎలక్ట్రీషన్లుగా,కారోబార్లుగా పనిచేస్తున్నారు. ఆయా గ్రామాల్లో విద్యుత్ బల్బులు అమర్చుటకు,మంచినీరు విడుదల చేయడానికి,ఇంటి పన్ను వసూలు చేయడానికి,గ్రామంలో ఊడ్చడం,మురికి కాలువలు శుభ్రపరచడం,ఎక్కడైనా చెత్త,దుర్గంధం ఉన్నా,జంతువు చనిపోయి కంపు కొడుతున్నా తీసివేసే పనులను వీరు చేస్తున్నారు.కానీ ఇందుకు సరిపడా వేతనం మాత్రం అందుకోవడం లేదు

### కనీస వేతనం అమలు చేయాలి



కొన్ని నెలల కిందట పంచాయతీ కార్మికులు రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె చేపట్టారు.ఉవ్వెత్తున సమ్మె కొన సాగడంతో పల్లెల్లో పారిశుద్ధ్యం పడకేసింది. అప్పటి ప్రభుత్వం దశలవారీగా కార్మిక సంఘాల నేతలు, కార్మికులతో చర్చలు జరిపి కొన్ని సమస్యలకైన పరిష్కారం అవుతాయని ఎదురు చూశాం అమలుకాలేదు.అలాగే కొత్త ప్రభుత్వం ఇచ్చిన హామీలు కూడ నెరవేర్చాలి, గ్రామపంచాయతీ మల్టీపర్పస్ వర్కర్ గా విధులు నిర్వహిస్తున్న వారికి కనీస వేతనం అమలు చేయాలి,కార్మికుడు చనిపోయిన తర్వాత దహన సంస్కారా లకు పదివేల నగదును పంచాయతీ నుంచి ఇవ్వాలని,5 లక్షల బీమా వర్తించేలా చర్యలు తీసుకుంది. మరికొన్ని సమస్యలకు పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చిన అవి కాగితాలకే పరిమిత మయ్యాయన్నారు.

**మార్తి నాగేశ్వరరావు (మల్టీపర్పస్ వర్కర్,చిన్నబీరవల్లి)**

### ఉద్యోగ భద్రత కల్పించాలి



గ్రామాల్లో పన్నులు,బిల్లుల వసూళ్ల ఆధారంగా నెలకు రూ. 9500 వేతనంగా చెల్లిస్తున్నారు. ఈ వేతనాలు కూడా నెల నెల కాకుండా మూడు, ఐదు నెలలకు ఒకసారి ఇస్తుండడంతో కుటుంబ పోషణ భారంగా మారుతుందని గ్రామపంచాయతీ మల్టీ పర్పస్ వర్కర్ దారా సురేష్ తెలిపారు. పండుగల సమయంలో కుటుంబంతో సంతోషంగా గడుపు దామన్న నాలుగు నెలలు గా జీతాలు రాక అవస్థలు పడుతున్నాం. ఎప్పటికైనా ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పిస్తుం దని ఆశతోనే అంతా విధులు నిర్వహిస్తున్నాం,విధుల్లో ఒత్తిడితో పనిచేస్తున్న ఉద్యోగ భద్రత,కనీస వేతనాల కోసం ఏళ్లుగా ఉద్యమిస్తూనే ఉన్నామని,గ్రామాల్లో ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు ఏ అధికారి పర్యటనకు వచ్చిన మరే చిన్న పనికైనా తప్పక ఉండాల్సిందేన్నారు. పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా ఈ వేతనాలతో కుటుంబ పోషణ చేయడం ఎలా సాధ్యపడుతుందని కార్మికులు వాపోతున్నారు. ఆశా వర్కర్లకు ఇతర శాఖల సిబ్బందికి వేతనాలు పెంచుతున్న ప్రభుత్వం తమ గురించి మాత్రం పట్టించుకోకపోవడంపై కార్మికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు,ఏళ్ల తరబడి పంచాయతీల్లో కార్మికులగా పనిచేస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించి వేతనాలు పెంచాలని కార్మికులు కోరుతున్నారు.

**దారా సురేష్, మల్టీపర్పస్ వర్కర్ గోవిందాపురం**

FOLLOW: @ANNTELUGU
10-1-2025
WWW. EPAPER.MAHAADAILY.COM
భద్రాద్రి కొత్తగూడెం
మహా పత్రిక
ANN తెలుగు



# నైపుణ్యత గల ఉపాధ్యాయులను తయారు చేయాలి

## తొలి ఏడాది 11 వేలకు పైగా ఉపాధ్యాయుల భర్తీ

## రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు

**ఖమ్మం, జనవరి 9: మహా:** ఖమ్మం జిల్లాలోని డైట్ కళాశాల ద్వారా నైపుణ్యత గల ఉపాధ్యాయులను తయారు చేసి సమాజానికి అందించాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖామాత్యులు తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. గురువారం మంత్రి, ఖమ్మం నగరపాలక సంస్థ పరిధిలోని ఏడవ డివిజన్ టేకులపల్లిలో పర్యటించి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజతో కలిసి డైట్ అడ్మినిస్ట్రేటివ్ భవన ఆధునీకరణ, అదనపు సదుపాయాల ఏర్పాటు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ 70 సంవత్సరాలలో అనేక కార్యక్రమాలు చేపట్టినప్పటికీ ఆశించిన స్థాయిలో విద్యను అభివృద్ధి చేయలేక పోయామని అన్నారు. సమాజంలో ఉపాధ్యాయ వృత్తి చాలా కీలకమైందని, దీనివల్ల అద్భుతమైన మార్పులు సాధ్యమవుతాయని మంత్రి తెలిపారు. జీవితంలో ఎదిగి ఒక స్థాయిలో ఉన్న ప్రతి వ్యక్తికి ఏదో ఒక దశలో ఒక ఉపాధ్యాయుడు మార్గం చూపే ఉంటారని మంత్రి అన్నారు. మనం ప్రస్తుతం మంత్రులుగా, ఉన్నతాధికారులుగా ఉండటానికి మన గురువులు మూలమని అన్నారు. ప్రస్తుత డైట్ కళాశాలల్లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు భవిష్యత్తులో గొప్ప టీచర్లుగా తయారు కావాలని మంత్రి పిలుపునిచ్చారు. నైపుణ్యత ఉన్న ఉపాధ్యాయుల కొరత ఉండటం వల్ల విద్యా ప్రాముఖ్యత, ప్రమాణాలు తగ్గుతున్నాయని అన్నారు. భవిష్యత్తులో పిల్లలకు పూర్తి పరిజ్ఞానంతో సంపూర్ణ విద్య అందించేలా డైట్ కళాశాల నుంచి ఉపాధ్యాయులు బయటకు రావాలని అన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన మొదటి సంవత్సరంలోనే 11 వేలకు పైగా ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేశామని, ప్రతి సంవత్సరం ఖాళీ అవుతున్న టీచర్ పోస్టులను ఎప్పటికప్పుడు భర్తీ చేస్తామని అన్నారు. డైట్ కళాశాల కాంపౌండ్ గ్రీనరీ తో పరిశుభ్రంగా ఆహ్లాదకరంగా ఉండే విధంగా తయారు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కార్పొరేషన్ మేయర్ పునుకొల్లు నీరజ, డైట్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. సత్యనారాయణ, డి.ఈ.ఓ. సోమశేఖరశర్మ, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, పబ్లిక్ హెల్త్ ఇఇ రంజిత్, మునిసిపల్ ఇఇ కృష్ణలాల్, ఖమ్మం అర్బన్ తహసీల్దార్ రవికుమార్, అధికారులు, కార్పొరేటర్లు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

### గ్రీనరి పెంచాలి

డైట్ కళాశాలలో ఎటువంటి మొక్కలు నాటాలో ప్రిన్సిపాల్, సంబంధిత అధికారులు సమన్వయం చేసుకుని విద్యార్థుల సహకారంతో గ్రీనరీ పెంచాలని అన్నారు. ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు ప్రజల శ్రేయస్సు కొరకు సమన్వయంతో పని చేయాలని అన్నారు.

### నాణ్యమైన ఉపాధ్యాయుల్ని తయారు చేయాలి

**అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ మాటాడుతూ ప్రస్తుత యువతలో ఉపాధ్యాయ వృత్తి పట్ల ఆసక్తి వ్యక్తం చేసే వారి సంఖ్య తగ్గుతుందని, ఖమ్మం డైట్ కళాశాల నుంచి అద్భుతమైన ఉపాధ్యాయులు తయారు అయ్యారని తెలిపారు. ఉపాధ్యాయ వృత్తిని ప్రోత్సహిం చాలంటే నాణ్యమైన ఉపాధ్యా యులను తయారు చేయాల్సిన అవసరం ఉంటుం దని, ఇందులో భాగంగా డైట్ కళాశాల పరిపాలన భవన ఆధునీకరణ పనులకు శంకుస్థాపన చేసుకోవడం చాలా మంచి పరిణామం అని అన్నారు.**




## పోలీసు సేవల ఫీడ్‌బ్యాక్ కోసం క్యూఆర్ కోడ్

**ఖమ్మం, జనవరి 09, మహా:** పోలీసుల పనితీరు, పోలీసులపై ప్రజల్లో ఉన్న అభిప్రాయాలను తెలుసుకునేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పోలీసు శాఖ రూపొందించిన క్యూఆర్ కోడ్ ఆఫ్ సిటిజెన్ పోస్టర్లను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ప్రారంభించారు. డీజీపీ కార్యాలయం హైదరాబాదు నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పోలీస్ కమిషనర్లు, జిల్లాల ఎస్పీ లతో గురువారంజరిగిన సమావేశం డీజీపీ డాక్టర్ జితేందర్ గారు క్యూఆర్ కోడ్ ఆఫ్ సిటిజెన్ పోస్టర్లను లాంఛనంగా ప్రారంభించారు. బాధితులు సమస్యలు విన్నవించేందుకు పోలీస్‌స్టేషన్లకు వెళ్లిన అనంతరం పోలీసు సిబ్బంది వ్యవహరించిన తీరు, ఫిర్యాదులు మొదలు పాస్‌పోర్ట్ వేరిఫికేషన్, ఈ – చలాన్, ఎఫ్ ఐ ఆర్, ఇతర సేవల గురించి పోలీస్ సిబ్బందిపై ప్రజలకు ఉన్న అభిప్రాయాలను సేకరించేందుకు క్యూఆర్‌కోడ్ అందుబాటులో తీసుకొని రావడం జరిగిందని, ఈ పోస్టర్లు పోలీస్ కమిషనర్ కార్యాలయంతో పాటు అన్ని పోలీస్ స్టేషన్లు, సర్కిల్ ఇన్స్‌పెక్టర్, ఏసీపీ కార్యాలయల్లో స్పష్టంగా కనిపించేలా ఏర్పాటు చేస్తున్నట్లు పోలీస్ కమిషనర్ తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ నరేష్ కుమార్, అడిషనల్ డీసీపీ లాఆర్డర్ ప్రసాద్ రావు, ట్రైనీ ఐపిఎస్ అధికారి రుత్వక్ సాయి పాల్గొన్నారు.

## ఫిబ్రవరి15 లోపు ఎయిడ్ టు వాలంటరీ సంస్థలు దరఖాస్తు చేయాలి

**ఖమ్మం, జనవరి 9:మహా:** ఫిబ్రవరి15 లోపు ఎయిడ్ టు వాలంటరీ సంస్థలు దరఖాస్తు చేయాలని గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఎన్. విజయ లక్ష్మి గురువారం తెలిపారు. కమీషనర్ గిరిజన సంక్షేమ శాఖ, హైదరాబాద్ వారి ఆదేశానుసారం జిల్లా లోని ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనుల అభివృద్ధి కొరకు పాటుపడే (ఎయిడ్ టు వాలంటరీ ఆర్గనైజేషన్) ప్రభుత్వేతర, స్వచ్ఛంద సంస్థల నుండి 2024–25 సంవత్సరానికి దరఖాస్తులు కోరుతున్నట్లు, అర్హత కలిగిన వారు ఫిబ్రవరి 15 లోగా ఆన్ లైన్ వెబ్ సైట్ http:/ngo.tribal.gov.in ద్వారా దరఖాస్తు చేసి హార్డ్ కాపీలను ఉప సంచాలకులు, గిరిజన సంక్షేమ శాఖ, ఖమ్మం నందు సమర్పించాలని, పూర్తి వివరాల కొరకు కార్యాలయ పని రోజులలో సంప్రదించాలని ఉప సంచాలకులు పేర్కొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల పరిశీలన పూర్తి



**పాలేరు, జనవరి 9, మహా:** ఇందిరమ్మ లబ్దిదారులకు మరింత పారదర్శకమైన సేవలను అందించాలనే లక్ష్యంతో ఫిర్యాదుల కోసం ఇందిరమ్మ ఇండ్లు గ్రీవెన్స్ మాడ్యూల్‌ను తీసుకురావడం జరిగిందని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. గురువారం నాడు సచివాలయంలోని తన కార్యాలయంలో ఈ గ్రీవెన్స్ మాడ్యూల్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో ఏమైనా సమస్యలు ఎదురైతే indirammaindlu.telangana.gov.inకు ఫిర్యాదు చేయవచ్చు. ఈ ఫిర్యాదుపై ఎప్పటికప్పుడు తీసుకున్న చర్యల వివరాలు ఫిర్యాదుదారుని మొబైల్ కు మెసేజ్ ద్వారా తెలియజేయడం జరుగుతుంది.

మహా పత్రిక
ANN తెలుగు

# పండుగ నేపథ్యంలో పోలీస్ పహారా

## పోలీస్ కమిషనర్ సునీల్ దత్



**ఖమ్మం, జనవరి 09, మహా:** సంక్రాంతి పండుగకు ఊర్లకు వెళ్లేవారు తగిన జాగ్రత్త చర్యలు తీసుకోవాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తెలిపారు. సంక్రాంతి పండుగ నేపథ్యంలో పోలీస్ పహారా మరింత పెంచుతున్నామని ఆయన తెలిపారు. దీనికి అనుగుణంగా ప్రజలు సైతం తమకు సహకరించాలని కోరారు. ఊరికి వెళ్లే ప్రజలు ఇంట్లో ఉన్న నగదు, బంగారం ఆభరణాలు విలువైన వస్తువులను తమ వెంట తీసుకుని వెళ్లాలని లేదా.. బ్యాంకు లాకర్ లో అయినా దాచి పెట్టుకోవాలని సూచించారు. దొంగతనాల నియంత్రణకు అన్ని చర్యలు చేపట్టామని, రాత్రి వేళల్లో వీధుల్లో పెట్రోలింగ్ ,బీట్ గస్తీ ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. దొంగతనాల నివారణకు రాత్రిపూట కాలనీలతో పాటు కమిషనరేట్ పరిధిలోని బస్టాండ్, ఆటో అడ్డా, రైల్వే స్టేషన్లను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని పోలీస్ అధికారులకు ఆదేశించామని తెలిపారు.

### పోలీసుల సూచనలు..

- ఇంటికి తాళం వేసిన తర్వాత తాళం బయటకు కనిపించకుండా పరదా కప్పి ఉంచాలి. మెయిన్ డోర్ లోపల నుంచి లాక్ చేసి.. పక్క డోర్లకు తాళం వేయడం మంచిది.
- ఊరు వెళ్లేముందు ఇంట్లో బంగారు, వెండి, డబ్బు వంటి విలువైన వస్తువులను బీరువాలో పెట్టకూడదు. బ్యాక్ లాకర్లలో దాచుకోవడం మంచిది.
- విలువైన వస్తువులు, వ్యక్తిగత ఆర్థిక విషయాల సమాచారాన్ని ఇతరులతో పంచుకోవద్దు.
- బీరువా తాళాలు ఇంట్లో కప్ బోర్డులు లేదా ఇతర ప్రదేశాలలో ఉంచకూడదు.
- ఊరు వెళితే ఇంటి పక్కనవారికి, సంబంధిత పోలీసులకు సమాచారం అందించడం ద్వారా రాత్రి సమయాల్లో గస్తీ తిరగడానికి వచ్చినప్పుడు ఇంటి పై ప్రత్యేక శ్రద్ధ వహిస్తారు.
- రాత్రి సమయంలో ఏదైనా ఒక రూమ్ లో లైట్ వెలుగుతూనే ఉండేలా ఆన్ చేసి ఉంచాలి.
- అనుమానిత లేదా కొత్త వ్యక్తులు ఇంటి చుట్టూ తిరగడం కనిపిస్తే వెంటనే 100 కి ఫోన్ చేసి సమాచారం ఇవ్వండి.
- మీ మొబైల్ కి నోటిఫికేషన్ వచ్చేలా.. ఇంటికి సీసీ కెమెరా అమర్చుకోవాలి. ఇంటి బయట నాలుగు దిక్కులు కవర్ అయ్యేలా కెమెరాలు పెట్టాలి.
- స్థానిక పోలీస్ స్టేషన్ నంబర్‌ను తమ ఫోన్లలో ఉంచుకోవడం మంచిది.
- చుట్టుప్రక్కల వారిని తమ ఇంటిని కనిపెట్టి ఉండమని చెప్పి వెళ్లడం, ఇంటికి సంబంధించిన సమాచారం ఎప్పటికప్పుడు తెలుసుకోవాలి.
- ఇంట్లో ఎవరైనా మహిళలు, వృద్ధులు వద్దకు అపరిచితులు సమాచారం కావాలంటూ వస్తే నమ్మవద్దని చెప్పాలి.
- ప్రతి ఒక్కరు ఈ సూచనలను పాటించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

## శ్రీధర్ రెడ్డి పుట్టిన రోజు వేడుకలు



**నేలకొండపల్లి, జనవరి 9 మహా:** బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలు గురువారం మండల కేంద్రంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. మండల కమిటి ఆధ్వర్యంలో జన్మదిన కేక్ ను కట్ చేసి వేడుకలు చేశారు: స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పార్టీ మండలాధ్యక్షుడు పాగర్తి సుధాకర్ మాట్లాడారు...నిరంతరం ప్రజా సేవ కోసం పాటుపడే శ్రీధర్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలు నూరేళ్లు జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు మన్నె కృష్ణారావు, షేక్ షర్ఫీద్దీన్, సయ్యద్ మోహినుద్దీన్, కొండా హర్ష, గెల్లా సాయి, బాజా రామకృష్ణ, ఎలిగేటి నరసింహారావు, మన్నె రాధాకృష్ణ, కందరబోయిన గోపి, మారేపల్లి వెంకటేశ్వర్లు, తంగెళ్ల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## గురుకులంలో సంక్రాంతి సందడి....!



**నేలకొండపల్లి, జనవరి 9 మహా:** స్థానిక సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల లో గురువారం సంక్రాంతి సంబురాలు నిర్వహించారు. మండలం లోని సింగారెడ్డిపాలెం. గురుకుల పాఠశాల లో సంక్రాంతి ముందే వచ్చింది. విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆటా, పాటలతో సందడి చేశారు. భోగి ను పురస్కరించుకుని విద్యార్థులకు భోగి పండ్లు పోసి దీవించారు. సంక్రాంత్రి పర్వదినం ముగ్గులు వేసి, పొంగళ్లు చేసి...కనుమ రోజున పాడి పశువులకు పూజలు చేసిన తరహా లోనే సంక్రాంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ పద్మావతి మాట్లాడారు...సంక్రాంతి యొక్క విశిష్టత ను వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రమాసుందరి, సిబ్బంది. పాకనాటి కన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సత్తుపల్లి లో 114 మంది బైండోవర్



**సత్తుపల్లి, జనవరి 09, మహా:** సంక్రాంతి పండుగ రానున్న నేపథ్యంలో కోడి పందాలను నివారించే దిశగా కఠిన చర్యలు చేపట్టామని సత్తుపల్లి ఇన్స్‌పెక్టర్ కిరణ్ అన్నారు. పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు కోడిపందేలను నియంత్రించేందుకు సత్తుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని పేకాటరాయుళ్ళు, కోడిపందెం కేసుల్లో ఉన్న పాత నిందితులను, కోడి కత్తులను తయారు చేసే, కోడి కత్తులు కట్టేవారిని మొత్తం 114 మందిని మెజిస్ట్రేట్ ఎదుట హాజరపరిచి బైండోవర్ చేసినట్లు సత్తుపల్లి పట్టణం సీఐ కిరణ్ తెలిపారు. బుధవారం 54 మందిని గురువారం 63 మందిని సత్తుపల్లి పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో సంక్రాంతి పండుగను ఉద్దేశించి వారికి కౌన్సిలింగ్ నిర్వహించి, కోడిపందేలు, పేకాట నిర్వహిస్తే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## పెద్దమ్మతల్లి ఆలయాన్ని సందర్శించిన పొంగులేటి సతీమణి



**పాల్వంచ, జనవరి 09, మహా:** తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సతీమణి పొంగులేటి మాధురి పాల్వంచలోని పెద్దమ్మతల్లి ఆలయాన్ని గురువారం సందర్శించారు. భద్రాచలం ముక్కోటి దర్శనానికి వెళ్తూ మార్గ మధ్యలో పాల్వంచలో ఆగారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు ఆలయ మర్యాదలతో మాధురిని ఘనంగా సత్కరించారు. ప్రత్యేక పూజల అనంతరం ఆలయ అర్చకులు అమ్మవారి తీర్థప్రసాదాలను ఆమెకు అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు పొంగులేటి ప్రసాద్ రెడ్డి సతీమణి పొంగులేటి శ్రీ లక్ష్మి రెడ్డి, రాష్ట్ర నాయకురాలు విజయబాయి తదితరులు పాల్గొన్నారు.

# పర్యాటక ప్రాంతంగా ఖమ్మం ఖిల్లా అభివృద్ధి



**ఖమ్మం, జనవరి 9, మహా:** ఖమ్మం ఖిల్లా పైకి వెళ్లేందుకు ఏర్పాటు చేయనున్న రోప్ వే, జాఫర్ బావి అభివృద్ధి తో ఖమ్మం పర్యాటక ప్రాంతంగా మారుతుందని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. గురువారం ఖమ్మం ఖిల్లా ప్రాంతం పర్యాటక ప్రదేశంగా తీర్చిదిద్దడంలో భాగంగా జాఫర్ బావి పునరుద్ధరణతో పాటు, పర్యాటకులు సురక్షితంగా ఆహ్లాదకర వాతావరణంలో ఖిల్లా పైకి వెళ్లి సందర్శించే విధంగా రోప్ వే ఏర్పాటుకు కలెక్టర్ ఖిల్లా మెట్ల మార్గం ద్వారా అధికారులతో కలిసి ఖిల్లా పైకి వెళ్లి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఖమ్మం ఖిల్లాకు రోప్ వే ఏర్పాటుకు అనువుగా ఉండే మార్గం, ఎక్విప్మెంట్, ఖమ్మం ఖిల్లాకు రావడానికి రోడ్డు అనుకూలత, పార్కింగ్, టాయిలెట్స్ ఏర్పాటుపై పరిసరాలను తిరిగి కలెక్టర్ అధికారులకు పలు సూచనలు చేశారు.అంతకుముందు జాఫర్ బావిని, బావి వైపు జరుగుతున్న అభివృద్ధి పనులను అదనపు కలెక్టర్ డా. శ్రీజతో కలిసి కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ ఖిల్లాపై పర్యాటకు లకు ఆహ్లాదం కలిగే విధంగా సౌకర్యాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. మంత్రుల ఆదేశాల మేరకు ప్రజలకు అనుకూలంగా, ఖిల్లాకు పూర్వ వైభవం వచ్చే విధంగా తీర్చిదిద్దుతామని అన్నారు. సందర్శకులు ఖిల్లాకు ఎక్కడా కూడా ఇబ్బందులు కలగకుండా వచ్చేలా ఏర్పాట్లతో పాటు ప్రత్యేక హంగులతో లైటింగ్, అనువైన పార్కింగ్ పనులు ప్రారంభిస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట జిల్లా పర్యాటక శాఖ అధికారి సుమన్ చక్రవర్తి, అర్బన్ తహసీల్దారు రవికుమార్, మున్సిపల్ కార్పోరేషన్ అధికారులు ఉన్నారు.

# గోదావరి జలాలతో సస్యశ్యామలం



**తల్లాడ, జనవరి -9: మహా:** గోదావరి జలాలతో ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేయబోతున్నామని, ఆ దిశగా సీతారామ ఎత్తిపోతల పథకం పనులు వేగవంతంగా జరుగుతున్నాయని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. గురువారం మంత్రి, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ తో కలిసి తల్లాడ మండలం నూతనకల్ గ్రామంలో నాబార్డు నిధులతో నిర్మించిన ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘ కార్యాలయ భవనం, గోదాంను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ తల్లాడ మండలంతో తనకు చాలా రోజులుగా అనుబంధం ఉందని తెలిపారు. రైతు ప్రాధాన్యతగా ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. సాగర్ పై లిఫ్ట్ పెట్టి చివరి భూముల వరకు సాగునీరు తీసుకుని వచ్చామని, చెక్ డ్యాం లు నిర్మించామని, తన చిరకాల కోరిక అయిన గోదావరి జలాలు కూడా రైతుల పొలాలకు త్వరలో రాబోతున్నాయని మంత్రి తెలిపారు. గోదావరి జలాలు ఖమ్మం జిల్లాకు రావాలని తాను ఆకాంక్షించానని, కృష్ణా జలాలు రాని పరిస్థితుల్లో కూడా గోదావరి నీటితో ఖమ్మం జిల్లాలో సాగునీరు అందాలని, ఈ ప్రాంతం పచ్చగా ఉండాలని ఆలోచించి ఎత్తిపోతల ద్వారా ఖమ్మం జిల్లాకు గోదావరిని తీసుకు వస్తున్నామని, ఇటీవలే పెండింగ్ పనులు పూర్తి చేస్తానని ముఖ్యమంత్రి మాట ఇచ్చారని అన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ దొండపాటి వెంకటేశ్వర రావు, డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, జిల్లా సహకార అధికారి గంగాధర్, డిసిసిబి సిఇఓ వెంకట ఆదిత్య, పిఏసిఎస్ గంగదేవిపాడు చైర్మన్ తూము వీరభద్రరావు, డైరెక్టర్లు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

### రైతుల సంక్షేమానికి ప్రాధాన్యత

రైతుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ మొదటి సంవత్సరంలో రెండు లక్షల వరకు రుణాలు ఉన్న రైతుల ఖాతాలలో జమ చేశామని అన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా రుణాలు తీసు కుని మాఫీ కానీ అర్హులైన రైతులు ఉంటే వివరాలు అందించాలని, వాటికి కూడా రుణమాఫీ చేస్తామని అన్నారు. రైతును ఆదుకోవాలనే ఉద్దేశంతో 12 వేల రైతు భరోసా నిధులు రైతు ఖాతాలలో జమ చేసేందుకు నిర్ణయం తీసుకున్నామని, రాబోయే రోజులలో మంచి పంటలు పండి రాష్ట్ర ఆదాయం పెరిగితే రైతులకు ఇచ్చిన మాటను నిలుపుకుంటామని అన్నారు. వివిధ కారణాలతో రైతు మరణిస్తే ఆ కుటుంబానికి వారం రోజులలో 5 లక్షలు చేరే విధంగా రైతు బీమా పథకాన్ని కొనసాగిస్తున్నామని అన్నారు.

### సాగునీరు అందిస్తాం

రాబోయే సంవత్సరంలో కృష్ణ జలాలు రావడం ఆలస్యమైనప్పటికీ, గోదావరి నీటితో రైతులకు సకాలంలో సాగునీరు అందిస్తామని మంత్రి తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పది నియోజకవర్గాల పరిధిలో సాగునీటికి సంపూర్ణ భరోసా అందించేలా సీతారామ ప్రాజెక్టు పనులు జరుగుతున్నాయని అన్నారు. రాబోయే సంవత్సరానికి సత్తుపల్లి, వైరా నియోజక వర్గాలకు గోదావరి జలాలు చేరుతాయని మంత్రి తెలిపారు.

## అంగన్వాడీలో వియాన్స్ పుట్టినరోజు వేడుకలు



**బోనకల్,జనవరి 09,మహా:** కలకోట సొసైటీ చైర్మన్ కర్నాటి రామకోటేశ్వరరావు మేనల్లుడు లేళ్ల కార్తీక్ నిఖిత ల కుమారుడు వియాన్స్ పుట్టినరోజు సందర్భంగా రాయన్నపేట గ్రామంలో ఎస్సీ బీసీ అంగన్వాడీ కేంద్రాలలో రియాన్స్ నాయనమ్మ లేళ్ల మోనా కుమారి ఆధ్వర్యంలో అంగన్వాడి పిల్లలచే కేక్ కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. గతంలో ఎస్సీ అంగనవాడి కేంద్రం నందు కిటికీ డోర్స్ మరమ్మత్తులు, పెయింటింగ్స్ వేపిస్తామని హామీ ఇచ్చిన మేరకు మరమ్మత్తులు పెయింటింగ్స్ వేయించారు. అంగన్వాడి టీచర్,ఆయా పిల్లలు వారి తల్లిదండ్రులు వారికీ కృతజ్ఞతలు చెప్పారు. ఈ కార్యక్రమంలో కర్నాటి రామ కోటేశ్వరరావు సతీమణి స్వాతి వారి కుమార్తె కావ్య,అంగన్వాడీ కేంద్రాల టీచర్స్ ఆయాలు,పిల్లలు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



**ఖమ్మం సిటీ, జనవరి 09, మహా:** తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయంలో ఖమ్మం రూరల్ మండలానికి చెందిన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ గురువారం జరిగింది. ఈ చెక్కులను లబ్ధిదారులకు క్యాంపు కార్యాలయ ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి అందజేశారు. మొత్తం 26మంది లబ్ధిదారులకు రూ. 6.69 లక్షల విలువ చేసే చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రూరల్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## గంజాయితో పట్టుబడిన యువకులు..



**పాలేరు, జనవరి 9, మహా:** మోటార్ సైకిల్ పై గంజాయితో వెళ్తున్న యువకులను కూసుమంచి పోలీసులు పట్టుకోగా, ఇద్దరు యువకులపై కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించిన సంఘటన కూసుమంచి మండలంలో గురువారం చోటుచేసుకుంది. కూసుమంచి ఎస్ఐ నాగరాజు తన సిబ్బందితో కలిసి నాయకన్ గూడెం అండర్ పాస్ బ్రిడ్జి వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ముగ్గురు వ్యక్తులు మోటారు సైకిల్ పై వస్తు పోలీస్ వారిని చూసి పారిపోతున్నారు. వారిని తక్షణమే పోలీసులు పట్టుకోగా అందులో నాయకన్ గూడెం గ్రామానికి చెందిన కందుల అనిల్ కుమార్, షేక్ ఈసుబును పట్టుకొగా, ఒక వ్యక్తి పారిపోయారు. వారిని విచారించగా, వారి వద్ద నుండి 100గ్రాముల గంజాయిని, ఒక మోటారు సైకిల్, (2) మొబైల్ ఫోన్స్ ని స్వాధీనము చేసుకొనైననది. పోలీస్ విచారణలో పై ఇద్దరు సూర్యాపేట జిల్లా,మోతే మండలం, అన్నారుగూడెం గ్రామానికి చిలకబత్తిని వెంకటేష్, మండవ సాయి అను వారితో కలిసి గంజాయి వ్యాపారము చేస్తూ అక్రమ మార్గములో డబ్బు సంపాదిస్తున్నారని నేరం ఒప్పుకొన్నారని కూసుమంచి ఎస్ఐ నాగరాజు తెలిపారు. ఆ ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసి రిమాండ్ కు పంపించిటట్లు ఎస్ఐ తెలిపారు. మిగతా ఇద్దరు నిదితులు అయిన చిలకబత్తిని వెంకటేష్, మండవ సాయి, అన్నారుగూడెం అను వారు పరారిలో ఉన్నట్లు తెలిపారు.

## దిద్దుపూడిలో ఘనంగా ముగ్గుల పోటీలు



**వైరా, జనవరి 9, మహా:** ఖమ్మం జిల్లా వైరా మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డులో సంక్రాంతి సందర్భంగా ముగ్గుల పోటీ నిర్వహించారు ఈ ముగ్గుల పోటీకి ముఖ్యఅతిథిగా వైరా నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బానోత్ చంద్రావతి పాల్గొన్నారు ఈ సందర్భంగా చంద్రావతి మాట్లాడుతూ నూతన సంవత్సరం మొట్టమొదటి పండుగ సంక్రాంతిని ప్రతి ఒక్కరూ ఘనంగా జరుపుకోవాలని రైతులు పండించిన పంట ఇంటికి వచ్చే తరుణంలో ఆహ్లాదకరంగా జరుపుకునే ఈ పండుగను ఆస్వాదించాలని మనస్ఫూర్తిగా కోరుకున్నారు. వైరా నియోజకవర్గ ప్రజలందరికీ ముందుగా సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. అదేవిధంగా విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ గుడిపుడి సురేష్ మాచర్ల నాగభూషణం, మాజీ సర్పంచ్ కొత్త వెంకటేశ్వర్లు, జిల్లా కోఆప్షన్ సభ్యులు లాల్ మహమ్మద్, లయన్స్ క్లబ్ ప్రతినిధులు పెనుగొండ ఉపేందర్ రావు, వెంకటేశ్వరరావు చింతోజు నాగేశ్వరావు, రామ్ గోపాల్ దాస్,బుచ్చి రామారావు, వాసిరెడ్డి భారతి, హనుమాయమ్మ, వాసవి, ౨ పాల్గొన్నారు.

